# తీర్మానం

"గాయత్రికి పెళ్ళి కుదిరిందిరా!" అంది మా అక్కయ్య నేను యింటికి రాగానే.

ఆశ్చర్యంగా తల ఎత్తాను "ఏమిటీ! రుబ్బురోలుకా!"

పూలుకోస్తూన్న చెల్లెలూ, చదువుకుంటూన్న తమ్ముడూ ఫక్కున నవ్వారు.

"ఊర్కోరా" మందలింపుగా అంది అక్కయ్య తను కూడా ముసిముసిగా నవ్వుతూ.

"కూర్చో. చెపుతాను" కుర్చీ యివతలికి లాగుతూ హుషారుగా అంది.

"సరేలే. ఇపుడేనా ఏమిటి! వాడు అసలే ఆఫీసునుంచి అలసిపోయి వచ్చాడు" మంచినీళ్ళు తెచ్చిస్తూ అమ్మ కసురుకుంది.

"ముందు కాళ్ళు కడుక్కురా. అవన్నీ తర్వాత చెప్పుకోవచ్చు." అమ్మ ఆర్డర్ వినగానే బలవంతంగా లోపలికి నడిచాను.

"గాయత్రి పెళ్ళి..."

స్నానం చేస్తూన్నంతసేపూ అదే మాట మనసులో మెదుల్తోంది.

అవును మరి. పదేళ్ళనుంచీ చెప్పుకుంటూన్న మాట.

గాయత్రి వాళ్ళు మాకు దూరపు చుట్టాలు. నాకు వరుసకి అక్కయ్య అవుతుంది ఆమె.

నాకు బాగా గుర్తుంది. పదిహేనేళ్ళ క్రితం.. అప్పుడు ఆమెకి యిరవై ఏళ్ళు వుంటాయేమో!

ఒకరోజు మధ్యాహ్నం, అమ్మ మమ్మల్ని స్కూలుకి పంపిస్తూ చెప్పింది.

"ఇవాళ నేను పెదనాన్నగారింటికి వెళ్తున్నాను . గాయత్రక్కని చూడటానికి పెళ్ళివారొస్తున్నారు" అని .

ఆరోజు సాయంత్రం స్కూలునుంచి వచ్చి, అమ్మ కోసం ఎదురు చూస్తూ వరండాలో కూర్చున్నాం.

ఏడుగంటలకి వచ్చింది అమ్మ, కారబ్బూందీ, లడ్డూలూ పట్టుకుని.

పిల్లలందరం అవి తీసుకుని తింటూంటే.. నాన్న అడిగారు "ఎలా వున్నాడు పెళ్ళికొడుకు!" అని.

"బాగానే వున్నాడు. కానీ యిది వాళ్ళకి నచ్చుతుందో లేదో మరి! పిల్ల కొంచెం లావు కదా!" అమ్మ పెదవి విరిచింది.

అదిగో అలా మొదలయిన పెళ్ళిచూపుల ప్రహసనం ఈ పదిహేనేళ్ళలోనూ ఎన్నిసార్లు జరిగిందో!

మొదట్లో ప్రతిసారీ అమ్మ సహాయానికి వెళ్ళేది. వచ్చేటపుడు ఏదో ఒక స్వీటు పట్టుకొచ్చేది.

అందుకనే కాబోలు.. అపుడు మాకు గాయత్రక్క పెళ్ళిచూపులంటే సంబరంగా వుండేది.

కానీ ఆతర్వాత తర్వాత.. చిరాకు మొదలయింది. "ఎన్నాళ్ళు బాబూ ఈ గొడవ!" అనుకునేవాళ్ళం, యింట్లో అందరం.

నేను స్కూలు చదువు అయిపోయి కాలేజ్‌లో చేరాను. గ్రాడ్యుయేషనూ, పోస్టు గ్రాడ్యుయేషనూ అయిపోయి ఉద్యోగంలో చేరాను. నాన్న పోయారు.

అక్కయ్య పెళ్ళి చేశాం. ఇద్దరు పిల్లలు పుట్టారు. మళ్ళీ పురుటికి వచ్చింది. గాయత్రి మాత్రం యిప్పటివరకూ అలాగే వుంది.

ఒక్కొక్కసారి ఒక్క నెలలోనే నాలుగయిదు పెళ్ళిచూపులు జరిగేవి. "ఇదిగో.. వీటిల్లో ఏదో ఒకటి ఖాయమైపోతుంది" అనుకునేవాళ్ళు.

అవి అక్కడితోనే ఆగిపోయేవి. ఒక నెలో వారమో గాప్. మళ్ళీ పెళ్ళిచూపులు. మళ్ళీ నిరాశ.

సాధారణంగా అసలు ఎవరికీ పిల్లే నచ్చేది కాదు. ఎలాగోలా నచ్చిందనిపిస్తే..
జాతకాలు.. కట్నాలు.. ఏదో ఒక స్టేజిలో అంతా మొదటికొచ్చేది.
ఇన్నేళ్ళలోనూ గాయత్రి సాధించింది ఏమీ లేదు. అదే మెట్రిక్యులేషన్ చదువు.
అదే రుబ్బురోలు రూపం.
కాకపోతే ఈమధ్య మిషను కుట్టటమేదో నేర్చుకున్నట్లుంది. చుట్టుప్రక్కల
వాళ్ళ బట్టలు కుట్టి నెలకో అయిదొందలు సంపాదిస్తోందిట.
"అందరూ ఆశ వదిలేసుకున్నాక యిపుడు.. హటాత్తుగా ఎలా కుదిరిందో
ఈ పెళ్ళి!" ఆలోచిస్తూ బయటకి వచ్చాను. అమ్మ టిఫిన్ పెట్టింది.
అక్కయ్య మెల్లగా వచ్చి ప్రక్కన కూర్చుంది.
"ఊ చెప్పు." అన్నాను నేను.
"ఏవుందిలే చెప్పడానికి.." అంటూనే మొదలుపెట్టింది.
"..అబ్బాయికి సెక్రటేరియట్‌లో వుద్యోగం. మొదటి పెళ్ళి సంబంధమే.
పాతికవేలు కట్నం యిస్తున్నారు. మా పిన్నత్తగారి ఆడపడుచు వాళ్ళు..
ముషీరాబాద్‌లో వుంటారు. మొన్న వాళ్ళింటికి వెళ్తే ఆవిడ చెప్పిందీ
సంబంధం.."
"ఓహో.. యిది నీ నిర్వాకమేనా అయితే!" దాని మాటలు పూర్తి
కాకముందే ఆశ్చర్యంగా అన్నాను.
అది నవ్వుతూ తల వూపింది. ఇన్నేళ్ళనుంచీ ఏపని చేయలేక అందరూ
చేతులెత్తేశారో ఆపనిని తను సాధించిన గర్వం.. అక్కయ్య కళ్ళల్లో
మెరుస్తోంది.
"ఎన్నేళ్ళేమిటి యింతకీ అబ్బాయికి!" మంచినీళ్ళ గ్లాసందుకుంటూ
అడిగాను.
"నలభై" అక్కయ్య తాపీగా చెప్పిన జవాబుకి పొలమారింది.
"..ఏమిటీ!! .. మరి అబ్బాయి.. అబ్బాయి అంటావే!!"

నా కంగారు చూసి అమ్మతో సహా అందరూ నవ్వారు. "దీనికే ముప్పైఅయిదేళ్ళు వున్నాయి కదురా!" అంది అమ్మ.

*****

పది రోజుల తర్వాత.. ఆరోజు ఆఫీసులో యిన్స్పెక్షన్.

కానీ అదికాదు ఆరోజుకి వున్న యింపార్టెన్స్. ఆరోజు.. గాయత్రి పెళ్ళి.

ఇంట్లో అందరూ ప్రొద్దున పూటే వెళ్ళిపోయారు.

నేను సాయంత్రం ఆఫీసు అవగానే ఆటో చేసుకుని కళ్యాణమండపానికి బయలుదేరాను.

నలభైఏళ్ళ పెళ్ళికొడుకునీ, ముప్పై అయిదేళ్ళ పెళ్ళికూతుర్నీ చూడడం అంటే సరదాగా వుంది.

నాకే కాదు. ఇంట్లో అందరికీ అలాగే వుంది. ఇంకా కరెక్ట్‌గా చెప్పాలంటే కొంచెం వేళాకోళంగా వుంది.

గాయత్రి రూపం అలాగే వుంటుంది మరి. మా అమ్మ కన్నా లావుగా, పెద్దదానిలా వుంటుంది. నల్లటి మొహం.

ఆమెని పెళ్ళికూతురిగా వూహిస్తూంటేనే నవ్వొస్తూంది.

మేమందరం గాయత్రి అని చెప్పుకోవడం మానేసి చాలా రోజులయింది. ఇంట్లో ఎపుడు మాట్లాడుకున్నా "రుబ్బురోలు" అనో "ఆర్. ఆర్." అనో అనుకుంటాం.

ఆటో ఆగగానే పెళ్ళిపందిట్లోకి నడిచాను.

మాకు వున్న లాంటి సరదానే అందరికీ వున్నట్లుంది. చాలామంది వచ్చారు పెళ్ళికి. కానీ పెళ్ళి పందిరంతా ఏదో ఉత్సాహం లాంటి నీరసం... నీరసం లాంటి ఉత్సాహం.

ఇదివరకు నేను చూసిన పెళ్ళిళ్ళలా లేదు యిది.
పెళ్ళికూతురి చుట్టూ రంగురంగుల పట్టుచీరలలో స్నేహితురాళ్ళు..
వేళాకోళాలు.. ఛలోక్తులూ.. కలకల నవ్వులూ.. ఇవేమీ లేవు యిక్కడ.
"అమ్మా.. ఆ పళ్ళెమూ, గ్లాసూ యిలా అందుకోండి" లాంటి బ్రాహ్మడి మాటలూ.. మాట్లాడుకోవడమే మరచిపోయినట్లున్న చుట్టాలు..
"అమ్మయ్య. ఎలాగోలా ఈ కాస్త తంతూ అయిపోతే!" అన్నట్లు చూసే ముఖభంగిమలు..
పెద్దమ్మ, పెదనాన్న అయితే.. ఏదో ఈ ఘడియ కోసమే ప్రాణం నిలుపుకున్న వాళ్ళలా వున్నారు.
"అక్కడ తాళి కట్టగానే యిక్కడ వీళ్ళు సెలవు తీసుకుంటారేమో.." అనిపిస్తోంది వాళ్ళని చూస్తుంటే.
ఎవరెలా ఉంటేనేం! మొత్తానికి పెళ్ళి అయిపోయింది. గాయత్రి పెళ్ళి అ..యి..పో..యిం..ది.
పెళ్ళిలో అక్కయ్యని అందరూ మెచ్చుకున్నారు. ఇన్నాళ్ళుగా కుదరని గాయత్రి పెళ్ళిని ఈరోజు అది కుదిర్చినందుకు.
పెదనాన్న యిల్లు అమ్మేశారట. అప్పులన్నీ పోగా యాభై వేలు మిగిలాయి.
పాతికవేలు కట్నం.. పాతికవేలు పెళ్ళి ఖర్చు.
ఇంక చేతిలో పైసా లేదు.
అయితేనేం! పెళ్ళయిపోయింది. గాయత్రి పెళ్ళయిపోయింది.
తెల్లవారాక ఆ నీరస వాతావరణంలో వుండాలని అనిపించలేదు నాకు.
"ఇంటికెళ్ళి పోదాం పదండి" అంటూ అందర్నీ బయల్దేరతీశాను.
తాళం తీసి యింట్లో అడుగు పెడుతుంటే తమ్ముడు రెండు చేతులూ పైకెత్తి గోడలకీ, యింటికీ చెపుతున్నట్లుగా అరిచాడు.
"గాయత్రి పెళ్ళయిపోయిందోచ్" అని.

వాడి అరుపుకి రెండు చెవులూ గట్టిగా మూసుకుంటూ "అబ్బా!" అంది చెల్లెలు. "ఎందుకలా అరుస్తావ్! మా అందరికీ తెలుసులే." అంటూ వాడ్ని కసురుకుంది. ఆతర్వాత రెండు చేతులూ గుండెలమీద పెట్టుకుని "అమ్మయ్య. ఎలాగో గట్టెక్కాం నాయనా!" అంది, మా పెద్దమ్మని యిమిటేట్ చేస్తూ.

దాని యాక్షన్ చూసి అందరం ఫక్కున నవ్వాం.

రెండో రోజు సాయంత్రం నేను యింటికి వచ్చేసరికి అమ్మ, అక్కయ్య యింట్లో లేరు. మంచినీళ్ళు తెచ్చి యిచ్చిన చెల్లెల్ని "ఎక్కడికి వెళ్ళారు వీళ్ళిద్దరూ!" అని అడిగాను.

"గాయత్రక్కా వాళ్ళింటికి" అంది అది.

"ఎందుకు!"

"ఏమో!" అది గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

తమ్ముడు మాత్రం నాప్రక్కనుంచి వెళ్తూ కన్ను గీటాడు. "అన్నయ్యా! ఇవాళ రుబ్బురోలుకి ఫస్ట్ నైట్‌ట."

ఆ వెంటనే వాడుకూడా లోపలికి పరుగెట్టాడు.

"వెధవా!" అంటూ నవ్వుకున్నాను నేను.

నాలుగురోజుల తర్వాత గాయత్రి కాపురానికి వెళ్ళిందని తెలిసింది. నేను ముందే అనుకున్నట్లూ ఆమె అలా వెళ్ళిందో లేదో పెదనాన్నకి జబ్బు చేసింది. ఆ తర్వాత పదిరోజులకి ఆఫీసుకి ఫోన్ వచ్చింది నాకు. "మీ పెదనాన్నగారికి సీరియస్‌గా వుంది. ఒకసారి రండి" అంటూ వాళ్ళ ప్రక్క యింటివాళ్ళు చేశారు.

హాఫ్ డే లీవ్ పెట్టి వెళ్ళాను.

నేను ఊహించినదాని కన్నా ఘోరంగా వుంది అక్కడ పరిస్థితి. డాక్టర్ వచ్చి చూసి " గంటో, రెండు గంటలో" అన్నాడట.

ఎవరో యిద్దరు ఆడవాళ్ళు వున్నారు యింట్లో. ప్రక్క యింటి వాళ్ళు కాబోలు.

పెద్దమ్మ గోడకి ఆనుకుని నిశ్చలంగా కూర్చుని వుంది.

నేను పెదనాన్న మొహంలోకి తొంగి చూస్తుంటే, " క్రింద పడుకోబెట్టాలయ్యా" అంది ప్రక్కింటావిడ.

కంగారుగా వెనక్కి తిరిగాను.

"అల్లుడు ఆ గదిలో వున్నాడు. వెళ్ళి పిలుచుకురా బాబూ కాస్త" అంది మళ్ళీ ఆవిడే.

"వీళ్ళు యిక్కడే వున్నారా!" అనుకుంటూ నేను ఆశ్చర్యంగా లోపలికి నడిచాను.

బెడ్‌రూంలో అడుగు పెట్టబోతూ షాక్ కొట్టినట్లు ఆగిపోయాను.

లోపలినుంచి.. ఏడుస్తూ బ్రతిమాలుతున్న గాయత్రి గొంతు వినిపిస్తోంది, నంగి నంగిగా.. నిస్పృహతో వెర్రెక్కిన దానిలా...

దగ్గరగా వేసి వున్న తలుపు సందులోనుంచి అస్పష్టంగా కనిపిస్తున్నారు వాళ్ళు. మంచం మీద ఆమెను బలవంతంగా నొక్కి పట్టి వుంచిన అతని వీపు.. దండం పెడుతూన్న ఆమె చేతులూ.. విఫల యత్నంతో కొట్టుకుంటూన్న కాళ్ళు..

ఏదో జంతువు మూలుగులా వినిపిస్తున్నాయి ఆమె వెక్కిళ్ళు.

నేను అయోమయంగా వెనక్కి తిరిగి వస్తుంటే ఆడవాళ్ళిద్దరూ అభావంగా చూశారు.

ఇంతలో ప్రక్కింటాయన వచ్చాడు. ఆయన కూడా నాలాగే ఫోన్ అందుకుని వచ్చినట్లున్నాడు.

ఇద్దరం కలిసి పెదనాన్నని వాకిట్లో పడుకోబెట్టాం. క్షణాలు లెక్క పెడుతున్నట్లుగా నలుగురం ఆయన వైపే చూస్తూ నిలుచున్నాం.

"టెలిగ్రాములు ఏమైనా యివ్వాలా!" అన్నాడు ప్రక్కింటాయన.

"అడ్రస్‌లు తెలీవుగా! ఆ అమ్మాయి బయటకి వస్తే అలాంటివి ఏమైనా చేయచ్చు." బెడ్‌రూమ్ వైపు భయంగా చూస్తూ అంది వాళ్ళ ఆవిడ.

ఆవిడ మాటలు పూర్తవుతూండగానే ఆ గది తలుపులు విసురుగా తెరుచుకున్నాయి.

పెద్దపులి చేతుల్లోనుంచి తప్పించుకు వచ్చినట్లూ గాయత్రి బయటకి పరుగెత్తుకు వచ్చింది.

ఆమెని చూసి నేను ఉలిక్కిపడ్డాను. పదిరోజులలో ఒకమనిషి అలా మారగలదని ఎవరైనా చెప్తే నేను నమ్మి వుండేవాడిని కాదు. కానీ యిపుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. ప్రే..త..క..ళ కనిపిస్తోంది తన మొహంలో పెదనాన్న కాళ్ళని చుట్టేసి "నాన్నా.. నాన్నా.." అంటూ ఏడుస్తోంది. మేమందరం నివ్వెరబోయి చూస్తున్నాం.

అతను వెనకాలే వచ్చాడు. మా చూపులతోనూ, ఆమె ఏడుపుతోనూ సంబంధం లేనట్లు భుజం పట్టుకుని బలవంతంగా లోపలికి ఈడ్చుకు పోసాగాడు.

నేను అతనివైపు చేయి చాపుతూ "ఏవండీ!" అన్నాను వారింపుగా. అతని చేయి పట్టుకుని గాయత్రిని విడిపించబోయాను.

అంతే. నా చెంప ఛెళ్ళుమంది. నేను తేరుకునేలోపూ అతను గాయత్రితో సహా గదిలోకి నడిచి తలుపు వేసేశాడు.

అందరూ అవాక్కయి చూస్తుంటే.. ఆ నిశ్శబ్దంలో నుంచి సన్నగా పెద్దమ్మ ఏడుపు వినిపించింది.

"అతనికి.. మరీ యింత పిచ్చి వుందని తెలీలేదు. ఏదో పిల్ల పెళ్ళయితే చాలనుకున్నాం గానీ.. తీస్కెళ్ళి ఆ పిచ్చివాడి చేతుల్లో పెడుతున్నామనుకోలేదు.."

వెక్కిళ్ళ మధ్య వినిపిస్తున్న ఆమె మాటలకి నేను పెర్రివాడిలా చూశాను.
"నిక్షేపం లాంటి పిల్ల.. పెళ్ళి కాకపోయినా ఏదో దాని పొట్టకి అది సంపాదించుకుంటూనే వుంది.. దాని గొంతు కోశాం నాయనా.. మేం దాని గొంతు కోశాం.."
పెద్దమ్మ ఏడుపు గుండెని కోసేస్తోంది. "పిచ్చా! గాయత్రి భర్తకి పిచ్చా!"
నేనక్కడ ఒక్క క్షణం కూడా నిలబడలేకపోయాను. "అరగంటలో మళ్ళీ వస్తాను. మాఅమ్మని కూడా తీసుకు వస్తాను." అని చెప్పి బయటకి వచ్చాను.
గుండెలు పిండేసే ఈ విషాదాన్ని మా వాళ్ళతో పంచుకోకుండా వుండడం నాకు అసాధ్యమనిపించింది. పైగా ఈ పెళ్ళిని మా అక్కయ్య కుదిర్చిందన్న నిజం మరీ భరించలేనిదిగా అనిపించింది.
"ఎంత దారుణంగా మోసపోయాం మేమందరం!" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే దాదాపు పరుగెత్తుతున్నట్టుగా యింటికి వచ్చాను.
అమ్మ వరండాలో కూర్చుని బియ్యం ఏరుతోంది. అక్కయ్య ఎవరితోనో కబుర్లు చెపుతోంది. ఎవరావిడ! ఆవిడే.. అక్కయ్య పిన్నత్తగారి ఆ..డ..ప..డు..చు..
నేను అడుగు లోపలికి పెట్టూంటే ఆవిడ అంటోంది "మొత్తానికి భలేగా కుదిర్చావమ్మాయ్ పెళ్ళి. వాళ్ళసలు ఆ అబ్బాయికి యిక పెళ్ళి కాదనే అనుకున్నారు..."
నేను ఉలిక్కిపడ్డాను. "అక్కయ్యకి ముందే తెలుసా!"
"..ఈ పిచ్చి మూలంగా నలభై ఏళ్ళు వచ్చేవరకూ పెళ్ళవలేదు. అలాంటిది నువు తమాషాగా ఒక్కరోజులో కుదిర్చేశావు."
"సరేలెండి." అంది అక్కయ్య "పిచ్చో, ఎచ్చో ఒక మొగుడనేవాడు వుంటేనే స్త్రీకి గౌరవం. పెళ్ళి కాని స్త్రీని లోకం బ్రతకనిస్తుందా!"

నడినెత్తిన పర్వతాలు కూలినట్లూ నిలబడిపోయాను నేను.

"నిజమా! పెళ్ళి అంత ముఖ్యమా స్త్రీకి! బ్రతుకు కన్నా కూడా ముఖ్యమా!? తల్లీ, తండ్రీ, దగ్గరి బంధువులతో సహా ప్రతి ఒక్కరూ అదే తీర్మానమా! అలాంటి అనాగరిక తీర్మానానికి మళ్ళీ ప్రశంసా పత్రాలా!" దుఃఖంతో నా గుండె వణికింది. "ఎంత దారుణం!"

"వంద అబద్ధాలు ఆడైనా ఒక్క పెళ్ళి చేయమన్నారు. నువు ఒక్క నిజాన్ని దాచిపెట్టి ఒక పెళ్ళి చేశావు.." ఆవిడ పొగడసాగింది.

ఆమాటల్ని మధ్యలోనే ఆపుతూ అక్కయ్య అంది "ఊరికే చేయడం కాదండీ పిన్నిగారూ! పాతికవేలు కట్నం యిప్పించాను."

ఆవిడ పెద్దగా నవ్వుతుంటే.. కళ్ళల్లో గర్వం చిందులేస్తుండగా అక్కయ్య శృతి కలిపింది.

స్పృహ తప్పుతూన్న నాకు వరండా స్థంభం ఆసరా అయ్యింది.

*****

("ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రిక - 9.10.1998)